సాక్షి
వనపర్తి
ఆదివారం । 23 । మార్చి । 2025



జనరల్ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

వైద్యుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణం పోయిందని బాధితులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-35 (ఆదివారం సాయంత్రం)

సహర్ 4-56 (సోమవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.7/23.3

మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. సాయంత్రం వర్షం కురవచ్చు.

జాగ్రత్తలతో వడదెబ్బ దూరం

అత్యవసరమైతేనే బయట తిరగాలి

- సరిపడా నీరు తాగడంతో పాటు రక్షణ చర్యలు తీసుకోవాలి
- చిన్నారులు, వృద్ధులు వడదెబ్బ బారినపడే ప్రమాదం ఎక్కువ
- 'సాక్షి' ఫోన్-ఇన్‌లో డీఎంహెచ్‌ఓ డా. శ్రీనివాసులు



డా. శ్రీనివాసులు
డీఎంహెచ్‌ఓ

వనపర్తి: మార్చి నెలలోనే ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు సూచించారు. వడదెబ్బ.. వేసవి జాగ్రత్తలు తదితర అంశాలపై శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్-ఇన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురు అడిగిన సందేహాలను నివృత్తి చేయడంతో పాటు వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా పాటించాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు. మానవ శరీరం 37 డిగ్రీల ఉష్ణోగ్రతల వరకు తట్టుకోగలదని.. జిల్లాలో కొన్ని రోజులుగా 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో వాతావరణశాఖ ఆరంజ్ జోన్ జాబితాలో జిల్లాను చేర్చిందన్నారు. ఉపాధి, వ్యవసాయ తదితర ఆరుబయట పనులు ఉదయం 6 నుంచి 9:30 వరకు తిరిగి సాయంత్రం 4.30 నుంచి 6.30 వరకు చేయాలని సూచించారు. రసాయనాలతో తయారుచేసిన శీతల పానీయాలు తాగొద్దని, మజ్జిగ, అంబలి, స్వచ్ఛమైన నీరు ఎక్కువగా తాగడంతో వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చు వివరించారు. పండ్ల రసాలు, నిమ్మరసం ఎక్కువగా తీసుకోవాలని.. ఎండకు బయట తిరగాల్సి వస్తే తలకు టోపీగాని, తెల్లని వస్త్రంగాని ధరించాలని సూచించారు. ఎండలో తిరిగినప్పుడు చెమట ఎక్కువగా వచ్చి శరీరంలో నీటిశాతం తగ్గిపోవడంతో పాటు లవణాల శాతం క్షీణిస్తుందని.. కళ్లు తిరగడం, ఒంట్లో సత్తువ తగ్గినట్లు అనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించడంతో పాటు ఓఆర్ఎస్ పాకెట్లను నీటిలో కలిపిగాని, గ్లాస్ నీటిలో చిటికెడు ఉప్పు, చక్కెర కలిపి తాగాలన్నారు.

పిల్లలు, వృద్ధులు బయట తిరగొద్దు..

చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎండలో తిరిగితే త్వరగా వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని.. బయటకు వెళ్లాల్సి వస్తే తలపై వస్త్రం ధరించడంతో పాటు వాటర్ బాటిల్, అంబలి వెంట తీసుకెళ్లాలని సూచించారు. పిల్లలు రెండు నుంచి మూడు లీటర్లు, పెద్దలు మూడు నుంచి ఐదు లీటర్ల నీరు ప్రతిరోజు తప్పక తీసుకోవాలని, వేసవి ముగిసే వరకు మాంసకృత్తులు తక్కువ తీసుకోవడం మంచిదన్నారు. జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని.. 94 వేల పాకెట్లను పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో సిద్ధంగా ఉంచామని చెప్పారు.

ప్రశ్న: వడదెబ్బ తగలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?
– సుధాకర్, గోపాల్‌పేట

డీఎంహెచ్‌ఓ: ప్రస్తుతం జిల్లాలో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కళ్లు తిరగడం, శరీరంలో సత్తువకోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బ తగిలినట్లుగా భావించాలి. నిత్యం ఎండలో పని చేసేవారు నీరు ఎక్కువగా తీసుకోవాలి. శరీరంలో నీటిశాతం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ నుంచి తప్పించుకోవచ్చు.

ప్రశ్న: వడదెబ్బకు ఎలాంటి చికిత్స పొందాలి?
– వినయ్, మదనాపురం

డీఎంహెచ్‌ఓ: శరీరంలో నీరు, లవణాల శాతం ఒక్కసారిగా పడిపోవడంతో వడదెబ్బ సోకుతుంది. ఒక్కసారిగా కుప్పకూలుతారు. అలాంటి వారిని వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాయి. ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడంతో పాటు కొబ్బరి బొండాలు, నీరు అందించాల్సి ఉంటుంది. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

ప్రశ్న: ఆరోగ్యశాఖ తరఫున చలివేంద్రాలు, అంబలి కేంద్రాలు ఏర్పాటు చేస్తారా?
– సతీష్, అమరచింత

డీఎంహెచ్‌ఓ: ప్రభుత్వం తరఫున చలివేంద్రాలు, అంబలి కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు లేవు. దాతల సాయంతో బస్టాండ్లు, రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటుకు ప్రయత్నిస్తాం. ఎండకు తిరిగే ప్రజలు వాటిని ఉపయోగించుకొని ఉపశమనం పొందవచ్చు.

ప్రశ్న: పిల్లలు, వృద్ధులు ఎలాంటి ఆహారం తీసుకోవాలి?
– రమేష్, గోపాల్‌పేట

డీఎంహెచ్‌ఓ: వేసవిలో పిల్లలు, వృద్ధులు నిమ్మ, పండ్ల రసాలు, మజ్జిగ, పెరుగులాంటివి తీసుకోవాలి. కూరల్లో వేపుళ్ల తినడం తగ్గించాలి. ఎండలో బయట తిరగరాదు. ఫ్రిజ్ నీటికి బదులు మట్టి కుండలోని నీళ్లు తాగేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి.

ప్రశ్న: రోజుకు ఎన్ని లీటర్ల నీరు తాగాలి?
– రాజు, వీపనగండ్ల

డీఎంహెచ్‌ఓ: మనిషి బరువు ఆధారంగా నీరు తాగాల్సి ఉంటుంది. 50 కిలోల పైబడినవారు నాలుగు లీటర్ల కంటే ఎక్కువ తీసుకోవాలి. పిల్లలు మూడు లీటర్లకు తగ్గకుండా తాగాలి. దీంతోపాటు పండ్లు, నిమ్మరసం సేవించాలి.

ప్రశ్న: అతిగా చల్లటి నీరు తాగవచ్చా?
– ఆరిఫ్, అమరచింత

డీఎంహెచ్‌ఓ: మట్టి కుండలో చల్లబడిన నీరు తాగడం శ్రేయస్కరం. 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో చాలాసేపు తిరిగి ఇంటికి రాగానే వెంటనే అత్యధిక చల్లగా ఉండే ఫ్రిజ్ నీటిని తాగడం మంచిదికాదు.

న్యూస్‌రీల్

మిల్లు యజమానిపై కేసు నమోదు



మదనాపురం: మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వర రైస్‌మిల్లు యజమాని మంజులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పౌరసరఫరాలశాఖ డీటీ ఆసిఫ్ తెలిపారు. శనివారం డీఎస్‌ఓ కాశీవిశ్వనాథ్, అధికారుల బృందం రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించగా 2022–2023, 2023–24 వానాకాలం, యాస ంగి సీజన్‌లో ప్రభుత్వం కేటాయించిన వరి ధాన్యంలో 80 వేల బస్తాలు తక్కువగా ఉన్నాయని.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారుల వెంట ఆర్‌ఐ రాజేశ్వరి ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన



పాన్‌గల్: విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన సాగించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) మహానంది సూచించారు. శనివారం మండలంలోని దావాజీపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించి తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి బోధనపై పలు సూచనలు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కురుమూర్తినాయక్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు ప్రక్రియ శనివారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ ధర్మకర్త అయ్యలూరి రఘునాథాచార్యుల పర్యవేక్షణలో చేపట్టారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 30 మంది భక్తులు నాలుగు హుండీలను లెక్కించారు. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు రూ.4,24,340 ఆదాయం సమకూరిందని అధికారులు ధ్రువీకరించడంతో పాటు బ్యాంకు ఖాతాలో జమచేశారు. కార్యక్రమంలో ఈఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఐటీ టవర్ పనుల్లో వేగం పెంచండి


స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాకేంద్రంలో ఐటీ టవర్ నిర్మాణానికి ప్రతిపాదిత స్థల సర్వే నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శనివారం నాగవరం శివారులో ఐటీ టవర్ నిర్మాణానికి ఇదివరకు కేటాయించిన స్థలాన్ని కలెక్టర్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్ పరిశీలించారు. స్థలం ఐటీ టవర్ నిర్మాణానికి అనువైనదేనా కాదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు మరోమారు సర్వేచేసి నివేదిక సమర్పించాలని, నిర్మాణం పూర్తయితే యువతకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రమేష్‌రెడ్డి, సర్వే అధికారులు ఉన్నారు.

'ప్రాధాన్యత రంగాలను విస్మరించారు'


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ఎండీ జబ్బార్

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రధాన రంగాలైన విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం, సాగునీరు, గ్రామీణాభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించలేదని సీపీఎం జిల్లా నాయకుడు ఎండి జబ్బార్ ఆరోపించారు. శనివారం మండలంలోని బొల్లారం గ్రామంలో నిర్వహించిన పార్టీ మండలస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంకెల గారడీతో రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేశారని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నిధులు కేటాయించకపోవడం, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 100 శాతం పంట రుణమాఫీ, రైతుభరోసా, మహాలక్ష్మీ పథకం, కొత్త ఆసరా పింఛన్లు, వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా వంటి పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణయ్య, మహబూబ్‌పాషా, రవిప్రసాద్, నాయకులు బాలగౌడ్, ఆశన్న, ఈశ్వర్, కృష్ణయ్య, నిరంజన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరుకు రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి


డీజీఎం మురళికి వినతిపత్రం అందిస్తున్న చెరుకు రైతు సంఘం నాయకులు

అమరచింత: చెరుకు సాగుచేస్తున్న రైతులకు కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీ యాజమాన్యం తగిన ప్రోత్సాహకాలు అందించాలని కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న కోరారు. శనివారం ఫ్యాక్టరీ డీజీఎం మురళిని కలిసి చెరుకు రైతుల సమస్యలు విన్నవించారు. రెండేళ్లుగా సకాలంలో కోతలు పూర్తి చేయడం, రైతులకు అనుకున్న సమయానికి విత్తనాలు అందించడంతో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. సాగు రైతులకు కంపెనీ ప్రకటించిన రాయితీలు అందించి ప్రోత్సహించాలని కోరారు. వచ్చే సీజన్‌లో కోత కార్మికులకు అడ్వాన్సులు ముందస్తుగా చెల్లించి త్వరగా రప్పించాలని, కోత యంత్రాల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం డిమాండ్ల వినతిపత్రాన్ని డీజీఎంకు అందజేశారు. కార్యక్రమంలో వాసారెడ్డి, నారాయణ, తిరుపతయ్య, నాగేందర్, రామకృష్ణ, చంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న శివసేనారెడ్డి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని మినీ స్టేడియాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర క్రీడా ప్రాధికారత సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. శనివారం అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ త్వరలోనే కోలుకుని నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి వస్తారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే ఐదు రాజీవ్ మినీ స్టేడియాలను మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో నియోజకవర్గంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి అన్ని రకాల వసతులు సమకూర్చుతామన్నారు. పట్టణంలోని రాజీవ్– ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని రూ.15 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. నల్లమల క్రీడాకారులకు పుట్టినిల్లు అని, ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చత్రునాయక్, మల్లికార్జున్, రాము, లక్ష్మణ్, పవన్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారమే ఎజెండా



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ

నాగర్‌కర్నూల్ రూరల్: రైతు సమస్యల పరిష్కారమే ఎజెండాగా రాష్ట్ర రైతు సంఘం ఆవిర్భవించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని లక్ష్మణాచారి భవన్ వద్ద నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా మూడో మహాసభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులను రక్షించుకుందాం.. వ్యవసాయాన్ని పరిరక్షించుకుందాం.. గ్రామాలను కాపాడుకుందాం.. అంటూనే దేశానికి అన్నం పెట్టే రైతుకు పాలకులు సున్నం పెడుతున్నారని ఆరోపించారు. దేశంలో రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిన బీజేపీ ప్రభుత్వం రైతుల పోరాటాల వల్లే వాటిని వెనక్కి తీసుకుందని గుర్తుచేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. తక్షణమే రైతులందరికీ రుణమాఫీ చేయాలని, అలాగే రైతు భరోసా అందరికీ అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులుగౌడ్, వెంకటయ్య, కృష్ణాజీ, బాలమురళి, రవీందర్, శ్రీను, భరత్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నా.. అందని గృహజ్యోతి


జిల్లాకేంద్రంలో విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- జిల్లాలో సుమారు 14 వేల మంది పథకానికి దూరం

వనపర్తిటౌన్: జిల్లాలో తెల్ల రేషన్‌కార్డు ఉండి, గృహజ్యోతి పథకానికి దూరంగా సుమారు 14 వేల మంది ఉన్నట్లు విద్యుత్‌శాఖ అధికారికంగా వెల్లడించింది. గతేడాది ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు సర్వీస్ నంబర్, ఆధార్ నంబర్‌లో తప్పులు దొర్లితే పుర కార్యాలయాలు, గ్రామాలు, మండల కేంద్రాల్లో ఉంటే ఎంపీడీఓ కార్యాలయాల్లో సవరించుకొని లబ్ధి పొందుతున్నారు. ప్రజాపాలన తర్వాత ఏడాది కాలంగా ప్రభుత్వం ఎలాంటి దరఖాస్తులు తీసుకోలేదు. ఫలితంగా జిల్లాలో 13,658 వేల మంది రాయితీ పొందడం లేదు. గృహజ్యోతికి అర్హత ఉండి బిల్లు చెల్లించని వారి వద్ద రూ.1.75 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఆర్థిక సంవత్సరం ముగింపునకు వారమే గడువు ఉండటంతో బకాయిలు ఎలా వసూలు చేయాలో ఆ శాఖ అధికారులకు అంతుపట్టడం లేదు. క్షేత్రస్థాయి సిబ్బంది బిల్లు వసూళ్లకు వెళ్లగా 200 యూనిట్లలోపే విద్యుత్ వినియోగిస్తున్నామని.. బిల్లు చెల్లించమని తెగేసి చెబుతుండటంతో ఎలా రాబట్టుకోవాలో తెలియక తర్జనభర్జన పడుతున్నారు. బకాయిదారుల్లో అత్యధికంగా జిల్లాకేంద్రంలో 2,766, వనపర్తి రూరల్‌లో 1,511, పెబ్బేరులో 1,505, కొత్తకోటలో 1,305, ఆత్మకూర్‌లో 1,065 మంది ఉన్నారు.

మండలాల వారీగా బకాయిలు ఇలా..

కేంద్రం	బకాయిలు (రూ.లక్షల్లో..)
వనపర్తి	19.41
వనపర్తి	18.29
ఖిల్లాఘనపురం	11.11
పానగల్	9.51
వీపనగండ్ల	6.82
గోపాల్‌పేట	7.23
రేవల్లి	5.52
చిన్నంబావి	7.96
కొత్తకోట	14.66
పెబ్బేరు	22.13
మదనాపురం	6.84
శ్రీరంగాపూర్	4.42
అమరచింత	12.05
ఆత్మకూర్	22.45
పెద్దమందడి	6.99

వసూలు చేస్తున్నాం..



అర్హత ఉండి గృహజ్యోతి అమలుకాని వినియోగదారులు మున్సిపాలిటీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో నమోదు చేసుకుంటేనే మాకు జాబితా వస్తోంది. సాంకేతిక కారణాలతో కొందరికి గృహజ్యోతి వర్తించడం లేదు. జిల్లాలో 13,658 మంది ఈ పథకానికి దూరంగా ఉన్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారుల నుంచి రూ.1.75 కోట్ల బకాయిలు ఉన్న మాట వాస్తవామే. వాటిని చెల్లించాలని క్షేత్రస్థాయిలో వినియోగదారులకు విజ్ఞప్తి చేస్తున్నాం.
– రాజశేఖరం, ఎస్‌ఈ, విద్యుత్‌శాఖ

కంది క్వింటా రూ.6,821

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వేరుశనగకు క్వింటాల్ గరిష్టంగా రూ.6,821, కనిష్టంగా రూ.5,659 ధరలు లభించాయి. అదేవిధంగా కందులు గరిష్టంగా రూ.6,889, కనిష్టంగా రూ.6,680, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,280, కనిష్టంగా రూ.2,027, జొన్నలు గరిష్టంగా రూ.4,527, కనిష్టంగా రూ.4,027, ఆముదాలు గరిష్టంగా రూ.6,345, కనిష్టంగా రూ.6,225 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్ యార్డులో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,011 ఒకే ధర నమోదైంది. ఆర్ఎన్ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు రూ.1,962గా ఒకే ధర లభించింది.

ఎల్‌ఆర్ఎస్ వసూళ్లలో వేగం పెంచాలి


పుర కమిషనర్‌తో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి యాదయ్య

వనపర్తిటౌన్: పుర పరిధిలో ఎల్‌ఆర్ఎస్ వసూళ్లలో వేగం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, పుర ప్రత్యేక అధికారి యాదయ్య ఆదేశించారు. శనివారం పుర కార్యాలయంలో పుర కమిషనర్ వెంకటేశ్వర్లుతో సమావేశమై ఎల్‌ఆర్ఎస్ వసూళ్లపై ఆరాతీసి మాట్లాడారు. పుర పరిధిలో 28,946 మంది దరఖాస్తుదారులు ఉండగా.. ఇప్పటి వరకు 915 మంది తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడం రూ.కోటి ఆదాయం సమకూరిందని వివరించారు. ఎల్‌ఆర్ఎస్‌తో ఇళ్లు నిర్మించుకునేందుకు, బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఎల్‌ఆర్ఎస్ చెల్లింపునకు 25 శాతం రాయితీతో మార్చి 31 వరకు గడువు ఉందని.. పుర అధికారులు సెలవు రోజుల్లోనూ అందుబాటులో ఉంటారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రసార మాధ్యమాలు, ఫ్లెక్సీలు, ఇతర మార్గాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని.. పుర కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు వివరించారు.

త్వరలోనే బుద్దారం రిజర్వాయర్ బండ్ నిర్మాణం


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సుబ్రమణ్యం

గోపాల్‌పేట: బుద్దారం రిజర్వాయర్‌లో భాగమైన బండ్ నిర్మాణ పనులు త్వరలోనే చేపడతామని ఆర్డీఓ సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఆయన బుద్దారం రిజర్వాయర్ పరిసరాలను పరిశీలించారు. బండ్ నిర్మాణం చేపట్టే స్థలాన్ని చూసి ఎంతమంది రైతుల భూములకు ఇబ్బంది కలుగుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడే రైతులతో మాట్లాడారు. బండ్ నిర్మాణం, రిజర్వాయర్‌లో భూములు కోల్పోయే రైతులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తామని.. అభిప్రాయాలు, నష్టపరిహారం వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం చెరువు పరిధిలో 110 ఎకరాలు ఉండగా.. బఫర్ జోన్‌కు ఇంకా 100 ఎకరాలు అవసరం ఉందన్నారు. బాధిత రైతులకు ప్రభుత్వం నుంచి వీలైనంత ఎక్కువ పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని వివరించారు. అనంతరం బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఇరిగేషన్, ఎస్‌డీసీఎఫ్, రెవెన్యూ అధికారులు తిలక్ కుమార్‌రెడ్డి, యాదయ్య, రైతులు ఉన్నారు.

క్షయ నిర్ధారణలో రాష్ట్రస్థాయిలో ప్రథమం


పురస్కారం అందుకుంటున్న డీఎంహెచ్‌ఓ డా. శ్రీనివాసులు

వనపర్తి: వందరోజుల క్షయ క్యాంపెయిన్ ప్రోగ్రాంలో జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం లభించిందని.. కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచనలు, సహకారంతో అరుదైన ఘనత సాధించామని జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో పురస్కారం అందుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రారంభించిన వందరోజుల క్యాంపెయిన్‌లో అధికారులు, సిబ్బంది ఉత్తమ పనితీరు కనబర్చడంతో రాష్ట్రస్థాయిలో పురస్కారం దక్కిందన్నారు. జిల్లాలో 1.70 లక్షల మందికి క్షయ పరీక్షలు నిర్వహించి 436 మందికి వ్యాధి ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరికి 100 శాతం చికిత్స అందించడమే కాకుండా నాట్కో సంస్థ సహకారంతో పోషకాహార కిట్లు అందిస్తున్నట్లు చెప్పారు. వ్యాధి నిర్ధారణకు స్క్రీనింగ్ ఎక్స్‌రే యంత్రం కొనుగోలుకు కలెక్టర్ రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

శనేశ్వరుడికి శాస్త్రోక్తంగా పూజలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో జేష్ఠాదేవి సమేతంగా వెలసిన శనేశ్వరుడికి ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలినాటి శనిదోష నివారణ కోసం భక్తులు శనివారం తెల్లవారుజామున ఆలయానికి చేరుకుని తిలతైలాభిషేకాలతో తమ గోత్రనామార్చనలతో పూజలు జరిపించారు.

క్లుప్తంగా

పాము కాటుకు మహిళ బలి


లక్ష్మి (ఫైల్)

మరికల్: పాము కాటుకు మహిళ మృతిచెందిన ఘటన శనివారం గాజులయ్యతండాలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గాజులయ్యతండాకు చెందిన డేగవత్ లక్ష్మి పొయ్యి కట్టెల కోసం పొలానికి వెళ్లింది. కట్టెలు కొడుతుండగా ముళ్లపొదలో ఉన్న పాము కాటేసింది. ఆమె ఆజాగ్రత కారణంగా కొద్ది సమయానికి నోట్లో నుంచి నురుగులు వచ్చి అక్కడికక్కడే మృతిచెందింది. సాయంత్రం గమనించిన చుట్టుపక్కల రైతులు ఈవిషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. దిక్కుముక్కు లేని ఈ కుటుంబంలో తల్లి మృతితో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. గ్రామస్తులు చందాలు వసూలుచేసి అంత్యక్రియలు నిర్వహించారు.

భవనంపై నుంచి కిందపడి కార్మికుడు మృతి

మహబూబ్‌నగర్ క్రైం: నూతనంగా నిర్మిస్తున్న భవనంపై నుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. గాజులపేటకు చెందిన రమేష్(42) జిల్లాకేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న రెండవ అంతస్తు భవనంలో శుక్రవారం సెంట్రింగ్ బాక్స్ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే జనరల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ రెఫర్ చేశారు. అక్కడికి తీసుకెళుతున్న సమయంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట కొంత సేపు ఆందోళన చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం


మహేష్ (ఫైల్)

కోడేరు: ఉరేసుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ గోకారి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన మహేష్ (30)కు ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా గ్రామశివారులో ఓ చింత చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న వారు చూసి కుటుంబీకులు, పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొల్లాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పుష్ప, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సంపులో పడి మహిళ మృతి


బాలకిష్టమ్మ (49) (ఫైల్)

కల్వకుర్తి టౌన్: ప్రమాదవశాత్తు ఇంట్లో ఉన్న సంపులో పడి ఓ మహిళ మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాలు.. సుభాష్‌నగర్ కాలనీకి చెందిన బాలకిష్టమ్మ(49) తన కొడుకుతో కలిసి నిర్మల విద్యాలయం దగ్గర నివాసం ఉంటుంది. శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు జారి నీటి సంపులో పడింది. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే బయటకు తీశారు. ఆమె అప్పటికే మృతిచెందింది.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఆత్మకూర్: మైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన కేసులో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ఓ బాలికతో అదే ప్రాంతానికి చెందిన దండు రవి అనే యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రవిని శనివారం అదుపులోకి తీసుకున్నారు. వనపర్తి కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించారు.

జనరల్ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

వ్యక్తిగత కారణాలతో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- చికిత్సపొందుతూ మృతి.. వైద్యసిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు
- ఇంజక్షన్ మార్చి ఇవ్వడం వల్లే చనిపోయాడని ఆస్పత్రి ఎదుట ఆందోళన
- ముగ్గురు ప్రొఫెసర్లతో విచారణ చేయిస్తాం: సూపరింటెండెంట్


యువకులతో మాట్లాడుతున్న డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, సీఐలు అప్పయ్య, ఇజాజుద్దీన్

మహబూబ్‌నగర్ క్రైం: వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థికి జిల్లా జనరల్ ఆస్పత్రిలో వైద్యసిబ్బంది ఒక ఇంజక్షన్ బదులు మరో ఇంజక్షన్ ఇవ్వడం వల్లే శ్వాసలో ఇబ్బంది ఏర్పడి మృతి చెందాడని కుటుంబసభ్యులు, స్నేహితులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. విద్యార్థి సంఘాల నాయకులు అధికంగా రావడంతో కొంత సమయం ఆస్పత్రి ఆవరణలో ఉద్రిక్తంగా మారింది. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జడ్చర్లకు చెందిన రవీంద్ర(23) విద్యార్థి వ్యక్తిగత కారణాల వల్ల శుక్రవారం 11 డోలో 650 ట్యాబ్‌లెట్స్ వేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా.. కుటుంబసభ్యులు చికిత్స కోసం అదేరోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం 12.30 ప్రాంతంలో మృతి చెందాడు. చికిత్స చేస్తున్న క్రమంలో అతనికి ఇవ్వాల్సిన ఇంజక్షన్ ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడం వల్ల వైద్యసిబ్బంది బయటకు రాసి ఇవ్వగా.. తీసుకొచ్చి ఇంజక్షన్ ఇవ్వడంతో మృతి చెందాడని కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన నిర్వహించారు. ఆ ఇంజక్షన్ వికటించడం వల్లే శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది ఏర్పడి మృతి చెందాడని ఆరోపించారు. విషయం తెలుసుకున్న రవీంద్ర స్నేహితులు, బంధువులు భారీస్థాయిలో ఆస్పత్రి దగ్గర చేరారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్‌తో పాటు వన్‌టౌన్ సీఐ అప్పయ్య ఇతర పోలీసులు ఆస్పత్రికి చేరుకుని గొడవ చేస్తున్న యువకులకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. రవీంద్ర మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని, పోస్టుమార్టం తర్వాత మరణంపై అన్ని రకాల విషయాలు తెలుస్తాయని దాని ప్రకారం విచారణ పూర్తి చేస్తామని ఆర్ఎంఓ డాక్టర్ సమత వెల్లడించారు.


రవీంద్ర మృతదేహం

తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు

రవీంద్ర మృతి ఘటనపై ముగ్గురు ప్రొఫెసర్లతో కమిటీ ఏర్పాటు చేసి ఈ నెల 24న విచారణ చేయడం జరుగుతుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ 'సాక్షి'కి తెలిపారు. ఈ బృందంలో అనస్తీషియా, గైనిక్, రేడియాలజీ విభాగం హెచ్ఓడీలతో కూడిన బృందంతో విచారణ పూర్తి చేయిస్తామని తెలిపారు. ఆ రిపోర్ట్‌తో పాటు కెమికల్ అనాలసిస్, పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాత బాధ్యులపై తప్పక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ ఘటనలో ఆస్పత్రి సిబ్బంది న్యాక్ అనే ఫెయిన్ కిల్లర్ ఇంజక్షన్ తీసుకురావాలని అటెండర్‌కు చెప్పారని.. అతను మరో స్నేహితుడికి ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే అతను చెప్పింది కాకుండా మరో ఇంజక్షన్ తెచ్చినట్లు చెబుతున్నారని దీనిపై విచారణలో తేలుతుందన్నారు. అసలు వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ దుకాణదారుడు ఇంజక్షన్ ఎలా ఇచ్చాడు అనే అంశంపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం కారకులను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తామని, రిపోర్ట్‌లో వైద్య సిబ్బంది తప్పిదం ఉంటే ఉన్నతాధికారులకు రిపోర్ట్ ఇచ్చి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిరంతరం శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు


సారంగం వద్ద సహాయక బృందాలకు సూచనలు ఇస్తున్న అధికారులు

- గల్లంతైన కార్మికుల అచూకీ కోసం 29 రోజులుగా గాలింపు
- ఎస్ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ)సొరంగంలో ప్రమాదవశాత్తు చిక్కుకుపోయిన కార్మికుల జాడా కనుకొనేందుకు అధికార యంత్రాంగం సహాయక చర్యలను మరింత వేగవంతం చేసింది. గత నెల 22న దోమలపెంట ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలిన ఘటనలో 8 మంది కార్మికులు అందులో చిక్కుకోగా ఈనెల 9న టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్ మృతదేహం గుర్తించారు. మిగిలిన ఏడుగురి కోసం అన్వేషణ కొనసాగుతుంది. ఇంత వరకు వారి అచూకీ లభ్యం కాకపోవడంతో కడావర్ డాగ్స్ గుర్తించిన డీ1, డీ2 ప్రదేశాల్లో తవ్వకాలు ముమ్మురం చేశారు. డాగ్స్ పసిగట్టిన ప్రదేశాల్లో 8 నుంచి 10 మీటర్ల పొడవున గోతులు తీస్తూ మట్టిని బయటికి పంపించే పనిలో నిమగ్నమయ్యారు. అత్యంత ప్రమాదకరంగా ఉన్న 40 మీటర్ల వద్దకు చేరుకోవాలంటే మరింత శ్రమించాల్సిన అవసరం ఉంది. కేరళ డాగ్స్ 14 కిలోమీటరు సొరంగం ముందు భాగం 30 మీటర్ల వద్ద కార్మికుల జాడ కనుకొన్నట్లు సమాచారం. అతి క్లిష్టమైన ప్రమాదకరమైన ప్రదేశంలోని మట్టి, రాళ్లు, బురద తొలగింపు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తే.. మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందని జీఎస్ఐ అధికారులు తేల్చినట్లు తెలిసింది. అయితే ఎంతో జాగ్రత్తగా సహాయక చర్యలు కొనసాగించాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. సొరంగం ప్రమాదం జరిగిన చోట చివరి 20 మీటర్ల వద్ద తవ్వకాలు జరిపితే పైకప్పు కూలే అవకాశం ఉండటంతో సింగరేణి రెస్క్యూ బృందాలు టైగర్ కాగ్స్ టింబర్ సపోర్టు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో మట్టి, రాళ్ల తొలగింపుతో పాటు కార్మికుల గాలింపు చర్యలు ఇంకా మొదలుకాలేదు.

అత్యాధునిక పరికరాలతో..

సొరంగంలోని మట్టి ,బురద, రాళ్లతో నిండిన టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) భాగాలను దక్షిణ మధ్య రైల్వే సహాయక సిబ్బంది అత్యాధునిక పరికరాలు ఉపయోగించి ప్లాస్మా కట్టర్‌తో ముక్కలు, ముక్కలుగా కట్ చేసి తొలగిస్తున్నారు. తొలగించిన శకలాలను ఇటాచ్ ద్వారా లోకో ట్రైన్, ఎస్కవేటర్ ద్వారా బయటికి తెస్తున్నారు. బయటికి తెచ్చిన శకలాలను క్రేన్ ద్వారా లారీలను నింపుతూ యార్డులకు తరలిస్తున్నారు. సొరంగంలో నిల్వ ఉన్న నీటిని, బురదను వాటర్ జెట్‌ల ద్వారా బయటికి పంపిస్తున్నారు. ఎస్కవేటర్ల ద్వారా కన్వేయర్ బెల్టు ద్వారా మట్టిని బయటికి పంపిస్తున్నారు .సహాయక చర్యల్లో ఎస్‌జీఆర్ఐ జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా, కడావర్ డాగ్స్ బృందం, ర్యాట్ హోల్ మైనర్స్, అన్వి రోబోటిక్ రంగాల నిపుణులు, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఆర్మీ, సింగరేణి.. ఇలా 12 రకాల రెస్క్యూ బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి.

మోనేశ్వర ఆలయంలో చోరీ


చోరీ జరిగిన మోనేశ్వర్ ఆలయం

మక్తల్: పట్టణంలోని రాయచూర్ రోడ్డు సమీపంలో ఉన్న మోనేశ్వర ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని విగ్రహమూర్తిని, దాదాపు 20 తులాల పంచలోహాల విగ్రహం, 5తులాల వెండి, 5తులాల వినాయకుడి విగ్రహం, హుండీతో పాటు మిగతా వస్తువులను ఎత్తుకెళ్లారు. ఎప్పటిలాగే శనివారం ఉదయం దేవాలయంలో పూజలు చేసేందుకు పూజారి విష్ణుమూర్తి ఆలయం వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లిచూసే సరికి వస్తువులు మాయమై ఉండటంతో చోరీ జరిగినట్లు కమిటీ సభ్యులకు తెలిపారు. హుండీని పక్కన పొలాల్లో పడేసి వెళ్లారు. మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి సమాచారం ఇవ్వగా ఆమె అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు చోరీ జరిగినట్లు మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అజిలాపూర్ లిఫ్ట్‌కు రూ.32.05 కోట్లు మంజూరు


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో జీఓ కాపీని అందుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: మండలంలోని అజిలాపూర్ లిఫ్ట్‌కు రూ. 32.05 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి జీఓ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల హామీ నిలబెట్టుకున్నాం..

ఎన్నికల సందర్భంగా అడవి అజిలాపూర్‌కి సాగునీటిని అందిస్తామని ఎన్నికల వేళ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నట్లు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఉన్న అడవి అజిలాపూర్‌కు సాగునీరు అందే పరిస్థితి లేకపోవడం చూసి సాగునీటిని గ్రామానికి తీసుకువస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అజిలాపూర్ ఎత్తిపోతలతో గద్దెగూడెం , వెంకటాయపల్లి గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తామన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

జలదోపిడీని ఆపాల్సి ఉంది


మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవాచారి

కల్వకుర్తి రూరల్: ప్రజాస్వామికవాదులు, పెద్దలు, ప్రజాసంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు కలసి వచ్చి జలదోపిడీని ఆపాల్సి ఉందని పాలమూరు అధ్యయన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవాచారి పిలుపునిచ్చారు. శనివారం కల్వకుర్తిలోని యూటీఎఫ్ భవనంలో జలదోపిడీపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. రాఘవాచారితో పాటు ఇరిగేషన్ నిపుణులు రవి హాజరయ్యారు. అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ వెంకట్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాఘవాచారి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా నష్టపోయిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా నష్టపోతూనే ఉండడం బాధాకరమన్నారు. 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యాక నీటి విషయంలో పాలమూరు జిల్లా రైతులకు అన్యాయానికి గురి చేశారని అన్నారు. ప్రస్తుతం పాలమూరు జిల్లాకు దక్కాల్సిన నీటివాటాను ప్రజల కళ్ల ఎదుటే నల్గొండ జిల్లాకు తరలించుకుపోతుంటే అడ్డగించాల్సిన 14మంది ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం ఏమిటని రాఘవాచారి ప్రశ్నించారు. జిల్లాలో సాగునీరు లేక ప్రజలు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లాకు జరిగిన అన్యాయాన్ని అడ్డుకుందామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ అన్యాయాన్ని ఆపాలన్నారు. సమావేశంలో సదానందంగౌడ్, ఆంజనేయులు, పరశురాముడు, బాబీ దేవ్, సీఐఐ పరశురాములు, అంజి, రాజేందర్, గోపాల్, సైదులు, బాలయ్య, జంగయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర


మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): భవన నిర్మాణ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీ.వెంకటేశ్ అన్నారు. కర్యాదర్శి సి. వెంకటేశ్ అన్నారు. శనివారం స్థానిక సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఏకం కావాలని అన్నారు. మార్చి 25న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు రాష్టంలో దేశంలో తీవ్ర ఇబ్బందులను ఎదురుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 25కోట్లకు పైగా, రాష్టంలో 30 లక్షలకు పైగా నిర్మాణ రంగా కార్మికులు జీవిస్తున్నారని తెలిపారు. అనంతరం మహాసభకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. భవన నిర్మాణ, ఇతర కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలు, రాజు, గోవర్ధన్, శేఖర్, ఆంజనేయులుపాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్యకు రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజేందర్‌రెడ్డి

మరికల్: భూమి అమ్మగా వచ్చిన డబ్బులు తనకు ఇవ్వలేదని భర్తను తాడుతో హత్య చేసిన భార్యను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మరికల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. నర్వ మండలం లంకాలకి చెందిన పాలెం అంజన్న(41) నారాయణపేటలోని చిట్టెం నర్సిరెడ్డి డిగ్రీ కళాశాలల్లో అటెండర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 20న రాత్రి 7గంటల తర్వాత ఇంటికి వచ్చిన భర్త అంజన్నతో భార్య పాలెం రంగమ్మ పొలం విషయంలో గొడవ పడింది. భర్త పేరు మీద ఉన్న ఐదెకరాల భూమిని తనపేరు మీద చేయకుండా అమ్మేశాడు. అమ్మిన డబ్బులు తనకు ఇవ్వలేదని కోపంతో నిద్రిస్తున్న భర్తను అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో భర్త మెడకు తాడు బిగించి ఊపిరాడకుండా చేసి హత్యచేసింది. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలిని అదుపులోకి తీసుకొని నారాయణపేట కోర్టుకు రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు. నర్వ ఎస్ఐ కుర్మయ్య, తిరుపతిరెడ్డి, రఘు, అజయ్ పాల్గొన్నారు.

టీబీ విభాగంలో పాలమూరుకు మొదటి బహుమతి


అవార్డు అందుకుంటున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, టీబీ అధికారి మల్లిఖార్జున్

రాష్ట్ర స్థాయిలో క్షయ విభాగంలో ఉత్తమసేవలు అందించినందుకు 2024 ఏడాదికి మహబూబ్‌నగర్ జిల్లాకు రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి లభించింది. శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ, రాష్ట్ర క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రాజేశం చేతులమీదుగా డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ మల్లిఖార్జున్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. - పాలమూరు

నేడు మహిళా శక్తి పురస్కారాలు ప్రదానం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ, ప్రమీల శక్తిపీఠం సంయుక్త ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని భారత్ స్కౌట్స్, గైడ్స్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సాహిత్య సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి వనజ, జి.శాంతారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే వివిధ రంగాల్లో విశేష కషి చేస్తున్న మహిళలకు 'మహిళా శక్తి పురస్కారాలు' విశ్వావసు నామ ఉగాదిని పురస్కరించుకొని ప్రముఖ సాహితీ వేత్తలకు ఉగాది పురస్కారాలతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ కవయిత్రి చుక్కాయపల్లి శ్రీదేవి సభకు అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య మసన చెన్నప్ప, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ప్రముఖ పద్యకవులు డాక్టర్ నలవోలు నరసింహారెడ్డి, పొద్దుటూరి ఎల్లారెడ్డి హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని కవులు, రచయిత్రులు, సాహితీవేత్తలు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చిచ్చుపెట్టిన స్నాక్స్

- సీనియర్లతో గొడవ
- క్షణికావేశానికి లోనై విద్యార్థిని
- మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం
- రాజాపూర్ కేజీబీవీలో ఘటన
- ఎలాంటి ప్రమాదం లేదన్న వైద్యులు


ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న జీసీడీఓ

రాజాపూర్: అనుమతులేకుండా స్నాక్స్ తీసుకున్న విషయంపై ఇరువురు విద్యార్థినుల మధ్య గొడవకు కారణమైంది. క్షణికావేశానికి గురైన ఓ విద్యార్థిని మల్టీవిటయన్ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని కేజీబీవీలో చోటుచేసుకుంది. వివరాలు.. కేజీబీవీలో వైష్ణవి ఎనిమిది తరగతి చదువుతోంది. శుక్రవారం సాయంత్రం స్కూల్‌లోని స్టాక్‌రూంలో ఉన్న స్నాక్స్‌ను మరికొందరు విద్యార్థినులతో కలసి అనుమతి లేకుండా తీసుకుంది. ఇది గుర్తించిన 9వ తరగతి క్లాస్‌లీడర్ అనుమతి లేకుండా స్నాక్స్ ఎందుకు దొంగిలించారని మందలించింది. ఈక్రమంలో కొంత వాగ్వాదం కొనసాగటంతో 9వ తరగతి విద్యార్థినులు చేయిచేసుకున్నారు. దీంతో మనస్తాపానికి గురై అందుబాటులో ఉన్న ఐదు మల్టీవిటమిన్ మాత్రలను మింగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. గమనించిన సీఆర్‌టి వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేసి సమాచారమిచ్చి జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో విద్యార్థిని కోలుకుంటుంది. మాత్రలతో ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్లు తేల్చారు. విద్యార్థిని ఘటన తెలియటంతో జీసీడీఓ రాధ, ఎంఈఓ సుధాకర్ ఆస్పత్రికి చేరుకొని వివరాలు తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. ఘటన జరిగిన వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు అందుబాటులో లేకపోవటంతో మేనమామ, నానమ్మ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థిని వద్ద ఉన్నారు.

టీడీసీఏ, ఏవైసీఏ క్రికెట్ టోర్నీకి ఉమ్మడి జిల్లా క్రీడాకారులు


టోర్నీకి ఎంపికైన క్రీడాకారులతో నవీన్‌కుమార్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈనెల 24 నుంచి 31 వరకు శంషాబాద్ తొండుపల్లిలో జరిగే తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (రూరల్), అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ అండర్–17 క్రికెట్ టోర్నమెంట్‌కు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు టీడీసీఏ ఉమ్మడి జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్ వెల్లడించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బ్రదర్‌హుడ్ క్రికెట్ అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అండర్–17 క్రికెట్ టోర్నీకి మహ్మద్ సోహైల్ (షాద్‌నగర్), దక్ష్ పాటిల్ (మహబూబ్‌నగర్), విరాట్‌కుమార్ (భూత్పూర్), సంజునాయక్ (అచ్చంపేట) రవితేజ (వనపర్తి) ఎంపికైనట్లు తెలిపారు. వీరు టీడీసీఏ రూరల్ వారియర్స్ జట్టు తరపున అమెరికన్ జట్టుతో తలపడుతారన్నారు. టీడీసీఏ గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి టోర్నమెంట్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 24న శంషాబాద్ మండలం తొండుపల్లిలోని ఎంపీఎస్ మైదానంలో అండర్–17 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, 31న జరిగే ముగింపు కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. టీడీసీఏ రూరల్ వారియర్స్ జట్టు మేనేజర్‌గా శ్రీనివాస్‌రెడ్డి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రదర్‌హుడ్ క్రికెట్ అకాడమీ కోచ్ ఎండి. రియాజుద్దీన్, టీడీసీఏ సభ్యులు నవాజ్‌షా, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.